



సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్







జెండా వందనం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, గరీమా అగ్రవాల్, సీపీ అనురాధ తదితరులు, పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ప్రభాకర్, కవాత్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది



ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం

# ఇది ప్రజాపాలన

## అభివృద్ధి, సంక్షేమం మాకు రెండు కళ్లు

## రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకున్నాం

- జిల్లాలో 1.89 లక్షల కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్లు
- 2.23 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- 3.23 లక్షల మందికి రూ.500కే గ్యాస్ సిలిండర్
- గౌరవెల్లితో హుస్నాబాద్ మెట్టభూములు సస్యశ్యామలం
- రౌడీలు, కేడీలు, నేరస్థులపై కఠిన చర్యలు
- స్వాతంత్ర్య వేడుకలో మంత్రి పొన్నం ప్రభాకర్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు 15 : ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రజాపాలన అందిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సమసమాజ నిర్మాణంతోపాటు సర్వతోముఖాభివృద్ధికి చెమట చుక్కలు చిందిస్తున్నామని చెప్పారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం సిద్దిపేట జిల్లా ప్రగతిపై ప్రసంగించారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలోని 499 గ్రామాలు, ఐదు మున్సిపాలిటీల్లో ప్రజల నుంచి 3.25 లక్షల దరఖాస్తులను స్వీకరించామని గుర్తు చేశారు. ఈ దరఖాస్తుల ఆధారంగానే తాము ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేరుస్తున్నామని వివరించారు. నివేదికలోని పలు అంశాలు ఆయన మాటల్లోనే..

- జిల్లాలో ఇప్పటివరకు 2.23 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి రూ.82 కోట్ల లబ్ది చేకూర్చాము.
- 15,516 మంది పేదలకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా చికిత్స అందించి రూ.34.39 కోట్లు ఖర్చు చేశాం.
- రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని జిల్లాలోని 1,65,912 కుటుంబాలకు వర్తింపజేస్తున్నాం. ఇప్పటివరకు 3,23,012 సిలిండర్లను లబ్ధిదారులకు సరఫరా చేశాం.
- గృహజ్యోతి కార్యక్రమం ద్వారా 1,89,806 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రూపంలో జీరో బిల్లులు అందజేస్తున్నాం.
- రుణమాఫీకి సంబంధించి తొలి విడతలో 53,129 మంది రైతులు, రెండో విడతలో 27,875 మందికి సుమారు రూ.560 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగింది. మూడో విడతలోనూ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేపట్టాం.

### గౌరవెల్లితో సస్యశ్యామలం

కరువు పీడిత ప్రాంతమైన హుస్నాబాద్ మెట్ట భూములను పచ్చని మాగాణులుగా మార్చడానికి గౌరవెల్లి రిజర్వాయర్‌ను శరవేగంగా పూర్తి చేయిస్తున్నామని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 1.6లక్షల ఎకరాలకు సాగు నీరందించే బృహత్తర నీటి పథకంగా పేర్కొన్నారు. మిగతా పనులను పూర్తి చేయడానికి రూ.431 కోట్లను ఇటీవలనే ప్రభుత్వం విడుదల చేసిందని ప్రకటించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతు వేదికలలో 5,659 మంది రైతులకు శాస్త్రవేత్తల ద్వారా పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

### నేరాలపై ఉక్కుపాదం

శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీసు యంత్రాంగం నిబద్ధతతో కృషి చేస్తోందని మంత్రి పొన్నంఅన్నారు. గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తు పదార్థాలపై జిల్లాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లుగా వివరించారు. సిద్దిపేటను మాదక ద్రవ్య రహిత జిల్లాగా ఏర్పాటు చేయడానికి పాటుపడుతున్నామని వెల్లడించారు. నేరాలను నియంత్రించడంతోపాటు రౌడీలు, కేడీలపై ఉక్కుపాదం మోపుతున్నామని వివరించారు. శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని ఈ సందర్భంగా పొన్నం హెచ్చరించారు.





### 'నేను సైతం' అంటూ..

'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అంటూ పొన్నం ప్రభాకర్ తన ప్రసంగం అనంతరం సుద్దాల అశోక్ తేజ రాసిన కవితాగేయాన్ని చదివారు. తాము సైతం ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాలుపడతామని అన్నారు. ఇక ప్రసంగానికి ముందు పలు వ్యాఖ్యలు చేశారు. నాడు ఆంగ్లేయుల పాలన నుంచి.. నేడు అరాచక పాలకుల కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగిందని అన్నారు. అందుకే తనకు ఈ సందేశం చదివి వినిపించే అవకాశం దక్కిందన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనూ చౌదరి, సీపీ డాక్టర్ అనురాధ, అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, ఇతర అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

### ఇటు శకటాలు.. అటు స్టాల్స్

ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖలు శకటాలను ప్రదర్శించాయి. వాహనాల చుట్టూ ఫ్లెక్సీలు అమర్చి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ కార్యక్రమాల వివరాలను పొందుపరిచారు. తొలిసారిగా ఆర్టీసీ బస్సు మైదానంలో చక్కర్లు కొట్టింది. ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రదర్శించారు. అటవీ శాఖ, పౌరసరఫరాల శాఖ, బ్యాంకింగ్ సేవల శకటాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా డీఆర్డీఏ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ, సెట్విన్, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి అభినందించారు.



### సాంస్కృతిక ప్రదర్శనలు.. ప్రశంసాపత్రాలు

ఇక స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ ప్రదర్శనలతో అబ్బురపరిచారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్, సీపీ ఈ ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించడమేగాకుండా విద్యార్థుల వద్దకు వెళ్లి ఫొటోలు దిగారు. చివరగా ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సుమారు 200 మంది ఈ జాబితాలో ఉన్నారు.

### కలెక్టరేట్‌లో జెండా ఎగరవేసిన అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 15 : కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆనాడు బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యాన్ని పొందడానికి ఎందరో తమ జీవితాలను త్యాగం చేశారని ఆ త్యాగధనులందరినీ గుర్తు చేసుకుంటూ వారి మార్గంలో నడుస్తూ అందరూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ కమిషనర్ అనురాధ, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో

హుస్నాబాద్, ఆగస్టు 15 : హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే నెహ్రూ చౌరస్తా, గాంధీ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో ఆయన సతిమణి మంజులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టులో మెజిస్ట్రేట్ శివరంజని, రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో రామ్మూర్తి, గాంధీ విగ్రహం, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల రజిత జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగించకుండా ఉండడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి



వేడుకలో ఆర్టీసీ శకటం



పౌరసరఫరాల శకటాన్ని ప్రదర్శిస్తున్న సిబ్బంది



పోలీస్ స్టాల్‌లో మంత్రికి చేస్తున్న బ్రీత్ ఎనలైజ్ టెస్ట్





సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల కోయ నృత్యం, జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

# ఆకునూరులో ప్రబలుతున్న విషజ్వరాలు

- సుమారు 15 డెంగ్యూ పాజిటివ్ కేసులు
- భయాందోళనలో గ్రామస్థులు
- హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేయాలని వేడుకోలు

చేర్యాల, ఆగస్టు 15 : చేర్యాల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో విషజ్వరాలు ప్రబలుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా సుమారు 60మందికిపైగా అనారోగ్యానికి గురై మంచానపడ్డారు. సుమారు 15మందికిపైగా డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదవగా, సిద్దిపేట, హైదరాబాద్ తదితర పట్టణాల్లో ఉన్న ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు సక్రమంగా పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడం, పలు వీధులు, చెత్తాచెదారం పేరుకుపోయినా పట్టించుకోకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో జలుబు, దగ్గుతో ప్రారంభమైన జ్వరాలు తగ్గకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకుంటున్నారు. టైఫాయిడ్‌తో పాటు డెంగ్యూ బారినపడుతున్నట్లు నిర్ధారిస్తున్నారు. గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో విధులు నిర్వహించే వైద్యులు సక్రమంగా అందుబాటులో లేకపోవడం, వారంలో రెండు, మూడురోజులే వచ్చిపోతుండటంతో ప్రాథమిక వైద్యం సకాలంలో అందడం లేదని వాపోతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడం, వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించక పోవడంతో ఈ దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు వీధుల్లో ఇంటికొక్కరి చొప్పున జ్వరాలు ఉన్నాయని, ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో హెల్త్‌క్యాంప్ నిర్వహించి విషజ్వరాలను అదుపులోకి తీసుకురావడంతో పాటు పారిశుధ్యంపైనా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గ్రామంలో ఓ వీధిలో పారుతున్న మురుగునీరు

### ఉమ్మడి జిల్లాలో 53,479 మంది రైతులకు

# రూ.710.22 కోట్లు మాఫీ

మెదక్, ఆగస్టు 15: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియలో గురువారం రూ. 2లక్షల వరకు పంటరుణాలను మాఫీ చేసింది. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇప్పటికే రెండు విడుతలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం గురువారం మూడో విడత మాఫీ నిధులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో అసలు, వడ్డీ కలిపి రూ. 2లక్షల లోపు పంటరుణం పొందిన 53,479 మంది రైతులకు రూ. 710.22 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలో 16,676 రైతు కుటుంబాలకు సంబంధించి 20,102 రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 281.66 కోట్లు జమ చేసింది. సిద్దిపేట జిల్లాలో 16,329 కుటుంబాలకు సంబంధించి 21,071 రైతుల ఖాతాల్లో రూ. 271.21 కోట్లు జమయ్యాయి. మెదక్ జిల్లాలో 9,445 కుటుంబాలలోని 12,306 మంది రైతుల ఖాతాల్లో రూ.157.35 కోట్లు డిపాజిట్ చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. కాగా, రైతులకు ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు రుణఖాతాలో పేరు వేర్వేరుగా ఉండడం, ధరణిలో భూమి వివరాలు లభించకపోవడం తదితర సాంకేతిక కారణాల వల్ల వీరికి రుణమాఫీ కాలేదు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జిల్లా కలెక్టరేట్లలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

# దంచికొట్టిన వాన..

- అత్యధికంగా గుమ్మడిదలలో 9.3 సెంటీమీటర్ల వర్షపాతం
- మరో రెండు రోజులు వర్ష సూచన
- ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్

మెదక్ అర్బన్/గుమ్మడిదల, ఆగస్టు 15: ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో 9.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రపురం 6.2 సెం.మీ., అమీన్‌పూర్ 5.9సెం.మీ., చౌట్కూర్ 4.6సెం.మీ., కొండాపూర్ 4.0 సెం.మీ., సిద్దిపేట జిల్లాలోని మిర్‌దొడ్డి 3.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారణశాఖ వెల్లడించింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.



గుమ్మడిదలలో ఓ ఇంట్లోకి చేరిన నీరు

# భూ వివాదంలో మహిళలపై దాడి



మహిళపై దాడి చేస్తున్న భూపాల్‌రెడ్డి

శివ్వంపేట, ఆగస్టు 15: భూ వివాదంలో మహిళలపై దాడి చేసిన ఘటన మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పిట్టలవాడలో హైదరాబాద్‌కు చెందిన మార్కారెడ్డి భూపాల్‌రెడ్డికి అక్కడ నివాసం ఉంటున్న పిట్టల వారి మధ్య కొంత కాలంగా భూవివాదం నెలకొంది. గురువారం భూపాల్‌రెడ్డికి సంబంధించిన వ్యక్తులు కడీలు పాతుతుండగా, తాము 50 ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నామని, తమ భూముల్లోకి ఎందుకు వస్తున్నారని అడ్డుకోవడంతో పిట్టల రేఖతోపాటు రాధ, లత, శారద అనే మహిళలపై భూపాల్‌రెడ్డి చేయి చేసుకుని చంపి వేస్తానని బెదిరించాడని బాధితులు ఆరోపించారు. హైదరాబాద్‌కు చెందిన ఈ వ్యక్తులు తమ భూమిని కాజేయాలన్న ఉద్దేశంతో దాడులకు ఒడిగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి భూమినే నమ్ముకుని జీవిస్తున్న తమ కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాస్‌చారిని సంప్రదించగా మార్కారెడ్డి, భూపాల్‌రెడ్డిలను భూ సమస్య పరిష్కరించే వరకు భూమి వద్దకు వెళ్లవద్దని చెప్పామని, పట్టాభూమి అటవీ ప్రాంతంలో ఉన్నందున భూవివాదం నెలకొనడంతో అటవీ, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వేకు ఫారెస్ట్ అధికారులను కోరినట్లు తెలిపారు.

# మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ

వర్గల్, ఆగస్టు 15: జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్నటువంటి గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ నడిపించారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దండుపల్లిలో గురువారం మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల స్ఫూర్తి, జాతిపిత మహాత్మాగాంధీ సారథ్యం, మహానుభావుల కృషి ఫలితమే స్వాతంత్ర్యమన్నారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆరదేనన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాములు, మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్, మాజీ ఎంపీపీ లత రమేశ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు శివ తదితరులు ఉన్నారు.



దండుపల్లిలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

### దొడ్డి కొమురయ్య అడుగుజాడల్లో నడవాలి

వర్గల్, ఆగస్టు 15: దొడ్డి కొమురయ్య అడుగు జాడల్లో యువత నడవాలని వర్గల్ మాజీ జడ్పీటీసీ బాలు యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని శేరిపల్లిలో కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి, గ్రామ కుర్మ సంఘం నాయకులతో కలిసి గురువారం దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలుయాదవ్ మాట్లాడుతూ.. పోరాడితే పోయిదేమీలేదన నినాదంతో దొరలతో భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన కొమురయ్య అమరుడైయ్యారన్నారు. వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట సేనాని ప్రజలకు వినిపించారన్నారు. అనంతరం కురుమ రిజర్వేసన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి మాట్లాడుతూ.. దొడి కొమురయ్య పోరాటమే ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షుడు బాషయ్య ఉపాధ్యక్షుడు గడ్డం అయిలయ్య ప్రధాన కార్యదర్శి మహేశ్, కోశాధికారి గడ్డం బీరయ్య, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ, సంఘం నాయకులు రాజు, కొనింటి అయిలయ్య, సంతోష్, ర్యాక రాజయ్య, గట్ల శ్రీను తదితరులు ఉన్నారు.



శేరిపల్లిలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గా అమ్మవారిని వివిధ రకాల పూలతో జాతీయ పతాకంలోని మూడు రంగులు వచ్చేలా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.
- పాపన్నపేట



స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని వాసవి మహాసంస్థాన్‌లో ఉమా రామలింగేశ్వర స్వామికి ఆలయ పురోహితుడు పండిత్ బల్దేవ్ జాతీయ పతాకాన్ని అలంకరించారు.
- సంగారెడ్డి రూరల్



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టరేట్, క్యాంపు కార్యాలయం, జడ్పీ కార్యాలయాల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- సంగారెడ్డి రూరల్




మెదక్ జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. పలు చోట్ల కలెక్టర్ రాహుల్‌రాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది.
- మెదక్ అర్బన్

# ప్రశంస

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విధుల్లో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల ఉద్యోగులకు ప్రశంసా ప్రత్రాలను అందజేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, మెదక్‌లో ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సంగారెడ్డిలో మంత్రి దామోదర్ రాజనర్సింహాలు పతాకావిష్కరణలు చేసి, ఆయా జిల్లాల ఉద్యోగులకు, పోలీసు శాఖ వారికి ప్రశంసపత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్లు మనుచౌదరి, రాహుల్ రాజ్, వల్లూరి క్రాంతి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రశంస ప్రతాలు అందుకున్న ఉద్యోగుల్లో నూతనోత్సాహం కనిపించింది.





సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న మంత్రి











## ఇక్కడ జెండా ఎగరలే..

నారాయణఖేడ్, ఆగస్టు 15: బీఎస్ఎన్ఎల్ (భారత్‌సంచార్ నిగమ్ లిమిటెడ్) కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగురలేదు. ఈ ఏడాది అధికారులు ఎవరూ లేకపోవడంతో జెండా ఎగురవేయలేదు. కార్యాలయంపై జెండా ఎగుర వేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం డివిజన్ అధ్యక్షులు నరేందర్ డిమాండ్‌చేశారు.

## పతకావిష్కరణలో ఇరువర్గాల ఘర్షణ

శివ్వంపేట, ఆగస్టు 15: మండల పరిధిలోని దొంతి గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా ఆవి ష్కరణ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వివాదం నెలకొంది. గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఏర్పాటు చేయగా జెండాను నేను ఎగరవేస్తానంటూ బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావడంతో అధికార పార్టీకి చెందిన వారు మేమే ఎగరవేస్తామని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో పోలీసులు సర్దిచెప్పారు. చివరికి గ్రామ పెద్దగా పురోహితుడు గోపాలకృష్ణ శర్మను జెండాను ఎగర వేయాలని కోరడంతో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

## తలకిందులుగా త్రివర్ణ పతాకావిష్కరణ




గజ్వేల్, ఆగస్టు 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణలో అపశృతి చోటుచేసుకుంది. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి జాతీయజెండాను తలకిందులుగా ఎగురవేశారు. అక్కడి వారు గుర్తించి జెండా కిందికి దించి సరిచేయడంతో మళ్లీ ఎగురవేశారు. ఈ విషయమై గజ్వేల్ బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తండ్రి చనిపోయిన గంటల వ్యవధిలోనే..

## రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి



వెంకటేశం(ఫైల్)

హత్నూర, ఆగస్టు 15: తండ్రి అంత్యక్రియలు జరిగిన గంటల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందిన విషాద ఘటన ఇది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్లానగర్ గ్రామంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అందూరి వెంకటేశం (45) తండ్రి ఇందూరి నర్సింలు బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. అదే రోజు సాయంత్రం సాదుల్లానగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుమారుడు అందూరి వెంకటేశం తండ్రి అంత్యక్రియలు ముగిసిన వెంటనే ఏదో పని నిమిత్తం బైక్‌పై దౌల్తాబాద్‌కు వెళ్లి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. రెస్టిల్ పరిశ్రమ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు.. వెంకటేశం బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశం తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతను నడుపుతున్న బైక్ పెట్రోల్ ట్యాంక్ మూత ఊడిపోగా స్పార్క్ వచ్చి మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైపోయింది. అప్పటికే ఆ కుటుంబంలో ఒకరు చనిపోయి, దుఃఖసాగరంలో మునిగి ఉండగా, వెంటనే మరొకరు చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరమైంది. వెంకటేశంకు ఇద్దరు కుమార్తెలు కాగా, ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. వెంకటేశం భార్య గతంలోనే చనిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీ కొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



విలాస్ (ఫైల్)

నారాయణఖేడ్, ఆగస్టు 15: ఆర్టీసీ బస్సు ఢీ కొని బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన నిజాంపేట మండలం మేఘ్యానాయర్ తండా దర్గా సమీపంలోని 161 బీ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. షోలాపూర్‌కు చెందిన నీలకంఠి విలాస్(35) పెద్దశంకరంపేటకు చెందిన యువతిని పెళ్లి చేసుకుని, ఇక్కడే మొబైల్ షాప్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం నారాయణఖేడ్ నుంచి పెద్ద శంకరంపేటకు మెదక్ మండలం కొత్తపేటకు చెందిన ప్రవీణ్, సురేష్‌లతో కలిసి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో నిజాంపేట నుంచి నారాయణఖేడ్‌కు వస్తున్న యాదగిరి గుట్ట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మూల మలుపు వద్ద వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో నీలకంఠి విలాస్ అక్కడికక్కడే చనిపోయాడు. ప్రవీణ్, నరేష్‌లు గాయపడ్డారు. మరణించిన విలాస్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గాయపడిన వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## బెల్ట్‌షాపుల్లో మద్యం పట్టివేత

రామచంద్రాపురం, ఆగస్టు 15: బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో కొల్లూరు పోలీసులు మూడు చోట్ల దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు సీఐ రవీందర్ కథనం ప్రకారం... కొల్లూరులో రాజు అనే యువకుడికి చెందిన కిరాణం దుకాణంలో సోదాలు నిర్వహించగా 23 లీటర్ల మద్యం లభించింది. తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్‌లలోని లేబర్ షెడ్లలో మద్యం విక్రయిస్తున్న ఆంజనేయులు, కనక రాయుడుల వద్ద 8 లీటర్ల చొప్పున మొత్తం 16 లీటర్లు స్వాధీన పరుచుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, 39 లీటర్ల మద్యం సీజ్ చేశారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


దుబ్బాక: వివిధ వేషధారణలోని విద్యార్థినులతో కొత్తప్రభాకర్‌రెడ్డి


సిద్దిపేట క్రైం : మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఎగరవేస్తున్న మున్సిపల్ చైర్మన్


గజ్వేల్: ఐవోసీలో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఆర్డీవో


హుస్నాబాద్: జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్


వర్గల్: తహసీల్ కార్యాలయం వద్దజెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ బాల్‌రాజ్


చేర్యాల: తహసీల్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్నఅధికారులు, తదితరులు


చిన్నకోడూరు: తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్


దౌల్తాబాద్: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్


సిద్దిపేట రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న డీఈవో


దూళిమిట్ట: తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్


కొండపాక: జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్న తహసీల్దార్ దిలీప్‌నాయక్


తొగుట: పీఏసీఎస్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న చైర్మన్ హరికృష్ణారెడ్డి

# త్రివర్ణ శోభితం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు వివిధ చోట్ల జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలంగానే స్వాతంత్ర్య సిద్ధించిదని వారు కొనియాడారు. 78 ఏళ్లలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని వారు పేర్కొన్నారు. నేటి యువత ఆ నాటి స్వతంత్ర పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


చిన్నకోడూరు:వివిధ వేషధారణలో చిన్నకోడూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు


బెజ్జంకి: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


ములుగు: తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న దృశ్యం


జగదేవ్‌పూర్: ఎంపీపీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ప్రత్యేకాధికారి


కుకునూరుపల్లి: చూపరులను ఆకట్టుకున్న జడ్పీ పాఠశాల విద్యార్థుల పరేడ్


కోహెడ: అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ వేషధారణలతో చిన్నారులు


హుస్నాబాద్‌లో విద్యార్థుల ప్రభాత భేరి


కోహెడ: పతాకాన్ని ఎగురవేస్తున్న మండల పరిషత్ ప్రత్యేకాధికారి హరీష్


నంగునూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తూ..


రాయపోల్: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ప్రత్యేకాధికారి


సిద్దిపేట రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో ..


బెజ్జంకి: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్


అక్కన్నపేట: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ప్రత్యేకాధికారి


గజ్వేల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ప్రతాప్‌రెడ్డి


హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ రజిత


సిద్దిపేట అర్బన్: సీపీఐ కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేస్తున్న జిల్లా కార్యదర్శి


సిద్దిపేట క్రైం: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ..


సిద్దిపేట కల్చరల్: జెండాను ఎగురవేస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు


మద్దూరు: మండల కేంద్రంలో జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు


సిద్దిపేట క్రైం: కమిషనర్ కార్యాలయంలో జెండాను ఎగరవేస్తున్న అదనపు డీసీపీ


మర్కుక్: అంగడికిష్టాపూర్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## రోడ్డుకు మరమ్మతులు

కుకునూరుపల్లి, ఆగస్టు 15: బొబ్బాయిపల్లికి వెళ్లే రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సగంలోనే ఆగిపోయింది. వర్షాకాలం కావడంతో రోడ్డు గుంతలమయంగా మారి ఇబ్బందులకు గురిచేస్తున్నది. దీంతో బొబ్బాయిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రెడ్డమైన రవీందర్ సొంత డబ్బులతో గుంతలలో మట్టిని పోయించి చదును చేపించాడు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఉపేందర్‌గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చేర్యాల, ఆగస్టు 15: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో కొమురవెల్లి మండలం కిష్టంపేటకు చెందిన మహమ్మద్ షహనాద్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.43,500విలువ చెక్కును మాజీ సర్పంచు కరుణాకర్, బీఆర్ఎస్ నాయకులు ఆమెకు గురువారం అందచేశారు.





## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన యాదవసంఘం నాయకులు


మంత్రికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న యాదవసంఘం నాయకులు

చేర్యాల, ఆగస్టు 15: కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన యాదవసంఘం నాయకులు గురువారం రాష్ట్ర బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 16వతేదీన గ్రామంలో యాదవ సంఘం భవనం ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందచేశారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ జట్పీడీసీ కొమ్ము నర్సింగరావు, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ ఆలయం వార్షికోత్సవం


ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

దుబ్బాక, ఆగస్టు 15: దుబ్బాక పట్టణంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వరాలయం మూడో వార్షికోత్సవంలో భాగంగా గురువారం రెండో రోజు పూజాకార్యక్రమాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయపూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం ఇచ్చారు. ఆయన వెంట సీనియర్ నాయకులు ఆర్. రాజమౌళి తదితరులు ఉన్నారు.

## నేడు సోషల్ ఆడిట్ ప్రజావేదిక

చేర్యాల, ఆగస్టు 15: ఉపాధిహామీ పథకం ద్వారా చేర్యాల మండలంలో జరిగిన పనులపై కొద్దిరోజులుగా ప్రత్యేక బృందం సామాజిక తనిఖీ చేపట్టి పూర్తి చేసింది. నేడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు ఏపీవో సింగిరెడ్డి మంజుల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## సీపీఎం నాయకుడి మృతి పట్ల సంతాపం

చేర్యాల, ఆగస్టు 15: చేర్యాల పట్టణానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు మేర్గొజు యాదగిరి (60) గురువారం అనారోగ్యంతో మృతి చెందడంపట్ల ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహంపై ఎరుపువస్త్రం కప్పి నివాళులర్పించారు. యాదగిరి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

● సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు దయానంద్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 15: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటం చేస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల స్థాయి సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని తిగుల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐని గ్రామగ్రామాన బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. పార్టీ పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. సీపీఐ ఏ పార్టీకి అనుకూలం కాదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా స్పందించి వారి పక్షాన నిలబడి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో భూ సమస్యలు చాలా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకపోతామని తెలిపారు. రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణ, నాయకులు రాజేశం, రాంచంద్రం, లింగం, ఎల్లారెడ్డి తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్‌రెడ్డి

## వైర్ల దొంగల అరెస్ట్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 15: వ్యవసాయ బావుల వద్ద బోరు మోటర్ల వైర్లను, సర్వీస్ వైర్లను దొంగలిస్తున్న నిందితులను సిద్దిపేట టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు.


నిందితులను చూపుతున్న టూటౌన్ పోలీసులు

పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన జక్కుల తిరుపతి తన బోరు మోటర్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిద్దిపేట పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన పర్వతం పోచయ్య, అతని కుమారుడు పర్వతం రాకేష్, తమ్ముడు పర్వతం రాజు, అతని స్నేహితుడు కర్రె కుమార్‌లు గురువారం నర్సాపూర్ రాజీవ్ రహదారి ఎల్లమ్మ గుడి పక్కన ఉన్న చెట్లపొదల నుంచి దాచిన వైర్లను తీస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా పలు ప్రాంతాల్లో వ్యవసాయ బోరు మోటార్ల వైర్లను చోరీ చేసి విక్రయించినట్లు అంగీకరించారు. దీంతో వారి నుంచి 250 మీటర్ల సర్వీస్ వైర్, చోరీకి వాడిన కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పర్వతం పోచయ్య ఆరు నెలల క్రితం కరీంనగర్ బస్టాండ్ సమీపంలో వైన్ షాప్ వద్ద దొంగలించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

## పాఠశాలకు రూ. 1 లక్ష సహాయం అందజేత

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 15: సిద్దిపేట అర్బన్ మండలం, తడకపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో చార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న జెట్టి మల్లేశం లక్ష రూపాయల నగదును అందజేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. తాను చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆర్థిక సహాయం అందించిన మల్లేశంను ఉపాధ్యాయ బృందం సన్మానించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మాధవి, సరోజ, పద్మ, ప్రసాద్, శ్రీనివాస్, బాల్యమిత్రులు స్కైలాబ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **నంగునూరు:** మండలంలోని అక్కెనపల్లి గ్రామ పాఠశాలలో 7వ తరగతి 2003 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మైక్‌సెట్‌ను గురువారం ప్రాథమిక పాఠశాలకు అందజేశారు.

● **సిద్దిపేట కల్చరల్:** 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సిద్దిపేట వాసవీవనిత క్లబ్ అధ్వర్యంలో పట్టణంలోని అభయజ్యోతి మనోవికాస కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, ఐరన్ రాక్స్ అందజేశారు. అనంతరం ఇద్దరు విశ్రాంత జవాన్లను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


నంగునూరు: మైక్‌సెట్‌ను అందజేస్తున్న దృశ్యం

## చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బెజ్జంకి, ఆగస్టు 15: పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుగ్గిళ్లలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుగ్గిళ్ల గ్రామానికి చెందిన గుగ్గిళ్ల దుర్గయ్య (70) అనే వృద్ధుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

జగదేవ్‌పూర్, ఆగస్టు 15: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెంకు చెందిన మాలోతు శ్రీకాంత్ ఓ వాహనంలో జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామ శివారు నుంచి రేషన్‌బియ్యం తీసుకువెళ్తున్నాడు. దీని మీద విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 50 క్వింటాళ్ల బియ్యం పట్టుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధ్యాయులను నియమించాలి

● బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల బాబు

సిద్దిపేట రూరల్, ఆగస్టు15; నారాయణరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు అదనంగా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల బాబు డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల చదువుకునేందుకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. వెంటనే అదనపు ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, నాయకులు స్వామి, రాజిరెడ్డి, భూమయ్య, ఎల్లం, నవీన్, గోపి, గణేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రేబర్తిలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు


సహజ సిద్ధ రాఖీలను కట్టుకున్న గ్రామస్థులు

మద్దూరు, ఆగస్టు 15: మద్దూరు మండలం రేబర్తిలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను గురువారం గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సహజ సిద్ధంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో రావిఆకు, గులాబీ పువ్వులతో తయారు చేసిన రాఖీలను సోదరభావాన్ని పెంపొందించేందుకు పలువురికి కట్టి ప్లాస్టిక్ రాఖీలకు దూరంగా ఉండి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మాదవ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.